**కథ**

**యం.రమేష్ కుమార్**

# ప్రేమకు రెండో వైపు

రాగిణి రాసిన ఉత్తరాన్ని తలచుకొంటేనే గుండె మండిపోతోంది శ్రీధర్‌కు. నాలుగు సంవత్సరాల ప్రేమను ఎంత తొందరగా తెంచుకోగలిగింది?

కానీ తనకు సాధ్యం కావట్లేదే?

యూనివర్సిటీలో చదివే రోజుల్లో ప్రేమకథల సినిమాలు చూసినప్పుడు ఇంకా ఎంతకాలం తీస్తారీ సినిమాలు అనుకునేవాడు. అలాంటి సినిమాలంటే చాలా చులకనభావం కూడా ఉండేది తనకి.

కానీ అదంతా తను ప్రేమలో పడక ముందు సంగతి.

రాగిణి యూనివర్సిటీలో తన జూనియర్. ఆమెతో పరిచయం.. స్నేహం.. అవన్నీ తీపి జ్ఞాపకాలు.

ప్రేమలో ఉన్నానని తెలుసుకొనేసరికి ఆశ్చర్యమనిపించింది- తనకి..తను ప్రేమలో పడ్డాడా?!

ప్రేమని నమ్మని తను ప్రేమలో మునిగితేలడం ఎలా జరిగిందో తనకే అర్థం కాని విషయం.

రాగిణి తనకు సరైన జోడీ అన్పించసాగింది. రాగిణికి కూడా అదే ఫీలింగ్.

కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ పూర్తిచేసి తను వైజాగ్‌లోనే ఓ ప్రయివేట్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో జాబ్ సంపాదించుకొన్నాడు.

రాగిణికి పి.జి.లో ఉండగానే సంబంధాలు చూస్తుండేవారు. అయినా రాగిణి పట్టుబట్టి పెళ్ళిని వాయిదా వేయడానికి ప్రయత్నించేది. దైవం అనుకూలించినట్టుగా ఆమెకు వచ్చిన సంబంధాలు కూడా ఏదో ఒక కారణం వల్ల తప్పిపోతుండేవి.

తనకు జాబ్ వచ్చిన తర్వాత ఇద్దరి ఇళ్ళల్లో తమ ప్రేమ సంగతి చెప్పి ఒప్పించి పెళ్ళి చేసుకుందామని ఆలోచన.

అనుకున్నట్టుగానే తనకు జాబ్ వచ్చిన తర్వాత ఇద్దరూ ఇంట్లో తమ సంగతి చెప్పారు. తనింట్లో అయిష్టంగానే అయినా తల్లిదండ్రుల్ని ఒప్పించగలిగాడు. కానీ రాగిణి ఇంట్లో కథ అడ్డం తిరిగింది. తమతో పోల్చుకుంటే ఆర్థికంగా తక్కువ స్థితిలో ఉన్నవాణ్ణి అందునా వేరే కులం వాణ్ణి చేసుకోవడానికి వాళ్ళింట్లో ససేమిరా అన్నారు. రాగిణి వాళ్లది కలిగిన వాళ్ల కుటుంబం.

రెండ్రోజుల తర్వాత ఏం చేయాలో తాము పకడ్బందీగానే ప్లాన్ చేసుకున్నారు. అన్నవరం పారిపోయి పెళ్ళి చేసుకోవడానికి సిద్ధమయ్యారు.

కానీ చివరి నిముషంలో రాగిణి తన ఫ్రెండ్ చేత ఉత్తరం పంపించింది. తన విషయంలో అనుమానించిన తల్లిదండ్రులు తనను ఇంట్లో నుండి బయటకు వెళ్లకుండా కట్టడి చేశారనీ అంతేకాకుండా తను నిన్ను పెళ్ళి చేసుకొనే పక్షంలో తామిద్దరం ఆత్మహత్య చేసుకొంటామని బెదిరించారనీ తననిక మర్చిపొమ్మనే ఆ ఉత్తరం సారాంశం.

ఆ ఉత్తరం చదవగానే శ్రీధర్ నిప్పుల కొలిమిలో మండినట్టయ్యాడు. తనెంత సున్నిత మనస్కుడో చిన్న విషయానికి కూడా ఎంతలా అల్లాడిపోయే మనస్తత్వమో రాగిణికి బాగా తెలుసు. మరి ఈ స్థితిని తట్టుకోగలడని ఎలా అనుకొంది? అసలు తనెలా తట్టుకుంది?

ఇంతగా కలిసిపోయిన తాము వేర్వేరు వ్యక్తుల్ని పెళ్లి చేసుకొని మనసు చంపుకొని ఎలా జీవించగలరు? అది సాధ్యమయ్యే పనేనా?

మానసికంగా ఒకటైపోయిన తాము మరొకర్ని పెళ్ళిచేసుకోవడమనే ఊహే భరించరానిదిగా ఉందే...!

తాను మాత్రం ఈ పరిస్థితిని తట్టుకోలేడు.

అలా బ్రతికే కంటే చావటం మేలు అనిపిస్తోంది.

శ్రీధర్ ఎంత ప్రయత్నించినా రాగిణి ఆలోచనల్నుండి తప్పించుకోలేకపోయాడు. ఇంక ఈ ప్రేమ సంగతి వదిలేసి తన పనేదో తాను చూసుకుంటే మేలని అనుకునేవాడు. కానీ మళ్ళీ ఆలోచనలు అటువైపే లాగేవి. రాగిణిని కలిసి విషయం తేల్చేద్దామని అనిపించేది. కానీ రాగిణిని ఇంట్లోంచి బైటికే పంపించడం లేదని తెలిసింది.

నెలరోజుల తర్వాత ఓ రోజు రాగిణికి పెళ్లి నిశ్చయమైందన్న విషయం తెలిసింది శ్రీధర్‌కి. తన క్లాస్‌మేట్స్‌లో రాగిణికి పరిచయమున్న కొందరికి శుభలేఖలు కూడా అందాయి. తనకి మాత్రం శుభలేఖ రాలేదు. వారం తర్వాత రాగిణి పెళ్లి జరిగిపోయింది. పెళ్లికి వెళ్లిన ఫ్రెండ్స్‌తో రాగిణి ముభావంగానే ఉందట. ఎక్కువ మాట్లాడలేదట. ఆమె తల్లిదండ్రుల బలవంతం మీదనే ఈ పెళ్లికి ఒప్పుకొని ఉంటుందని స్నేహితులు అన్నారు. ఏమైనా ఈ విషయాన్ని శ్రీధర్ జీర్ణించుకోలేకపోయాడు.

శ్రీధర్ బెస్ట్ ఫ్రెండ్, యూనివర్సిటీ హాస్టల్‌లో రూమ్మేట్ అయిన ఆనంద్ ఇంక ఈ ఆలోచనలు మాని కెరీర్ మీద దృష్టి పెట్టమని చెప్తుండేవాడు. సున్నిత మనస్కుడైన శ్రీధర్ ఆ ఆలోచనల నుండి తేరుకోలేకపోయాడు. ఎప్పుడూ దాని గురించే ఆలోచిస్తూ ఒక బలహీన క్షణంలో తప్పుడు నిర్ణయం తీసుకున్నాడు. తను చనిపోతే తప్ప రాగిణికి, ఆమె తల్లిదండ్రులకీ వాళ్లు చేసిన తప్పేమిటో తెలిసిరాదనుకున్నాడు. ఒకరోజు రూమ్ తలుపులు బిగించుకొని తెచ్చుకున్న పురుగుల మందును కూల్‌డ్రింక్‌లో కలిపేసి తాగేసాడు.

* * *

భార్యాభర్తలిద్దరి మధ్య అవగాహన బాగుంటే ఆ సంసారంలో ఆనందానికి కొదవేముంది? శృతి, శ్రీధర్‌ల సంసారం కూడా అలాంటిదే!


శృతిని పొందగలిగినందుకు శ్రీధర్ చాలాసార్లు తన అదృష్టాన్ని అభినందించుకున్నాడు. అంతేకాదు తను కూడా శృతిని ఏనాడూ ఇబ్బంది పెట్టింది లేదు.

పెళ్లయిన ఈ రెండు సంవత్సరాల్లో శృతి ఏది చెప్పినా తన మంచికే అన్న నమ్మకం శ్రీధర్‌లో ఏర్పడింది. ఆమె అంతగా అతన్ని ప్రభావితం చెయ్యగలిగింది.

ఇద్దరి రుచులూ, అభిరుచులూ, కోరికలూ అంతగా కలిసిపోయాయి అనేకన్నా, శృతి నెమ్మదితనం, సహన స్వభావం ఆ విషయంలో ప్రత్యేక పాత్ర వహించాయి అనడంలో సందేహమేమీ లేదు. ఆ విషయం శ్రీధర్‌కి కూడా అవగతమే.

ఆఫీస్ పని మీద తను హైదరాబాద్ వెళ్ళాల్సి ఉందని తెలియగానే శ్రీధర్‌కి సంతోషంగా అనిపించింది. ఆ సంతోషానికి కారణం ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న ఆనంద్‌ని కలవొచ్చనే ఊహ.

నిజంగా తనకు జీవితాన్నిచ్చినవాడు ఆనంద్. ఈ జీవితం.. ఈ సంతోషం రెండింటికీ కారణం వాడే.



శ్రీధర్ మనసు ఒక్కసారి గతంలోకి ప్రయాణించింది..

తను పురుగులమందు తాగేసి అపస్మారకంగా పడిపోయిన ఆరోజు.. అనుకోకుండా అప్పుడే ఆనంద్ తన రూమ్‌కి రావడం.. కిటికీలోనుంచి తనను, తన పక్కన పడివున్న పురుగుల మందు డబ్బాను చూడటం.. బలవంతంగా తలుపులు తెరిచి తనను హాస్పిటల్‌కు తీసుకువెళ్లడం.. అన్నీ ఒక దాని వెంట ఒకటి చకచకా జరిగిపోయాయి.

తను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రెండ్రోజులు తనని హాస్పిటల్‌లో ఉంచారు.

తను డిశ్చార్జి అయి ఇంటికి వచ్చాక తన తల్లిదండ్రులు, తన దగ్గరి వాళ్లకంటే ఎక్కువ ధైర్యం ఇచ్చిన వాడు ఆనంద్. తన మంచిని కోరి.. తను మళ్ళీ కెరీర్‌లో పైకి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నవాడు.

ఆనంద్ చెప్పిన ఫిలాసఫీ నిజంగానే తనలో కొత్త ఆశను నింపింది. అతడి మాటలు తనకో ఊరట కలిగించాయి. తను తీసుకొన్న నిర్ణయం తప్పనిపించింది. ఆనంద్ తనను ఒకటే ప్రశ్న అడిగాడు.

"విశ్వవ్యాప్తమైన ప్రేమను ఒక్కరిలోనే చూసి ఆ ప్రేమ మరెక్కడా దొరకదని ఎలా భావించావు?" అన్నాడు.

అతడి ప్రశ్న మొదట తనకసలు అర్థంకాలేదు. తనను సమాధానపరచడానికి ఏదో చెపుతున్నాడు అనుకున్నాడు.

కానీ ఆనంద్ చెప్పిన విషయాలు తనలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.

"నువ్వు ప్రేమించినది దేన్ని? ఆమె రూపాన్నా? అభిరుచులనా? లేక ఆమె స్వభావాన్నా? లేక ఇవన్నీ కూడా ఆమెలో నీకు నచ్చిన విషయాలేనా? అయినా కానీ ప్రపంచంలో మరెక్కడా అటువంటి అందం, అభిరుచులు, స్వభావం కలిసి ఉన్న అమ్మాయిలు ఉండరనా? లేక ఈమె ప్రేమించినంతగా నిన్ను వాళ్లు ప్రేమించలేరనా? ఏమిటి నీ సందేహం? ప్రేమనేది విశ్వజనీనమైనది. నువ్వు ఎవరికైనా ఎంత ప్రేమను ఇస్తావో అంతకంటే ఎక్కువగానే పొందగలవు. నిజానికి అంతా మనలోనూ మన ఆలోచనా విధానంలోనే ఉంది.

నువ్వు పెళ్ళి చేసుకొని నీ భార్యతో ఆనం

దంగా ఉన్న రోజున ఈ ప్రేమ వ్యవహారం కొన్నాళ్ల తర్వాత నీ జీవితంలో ఎటువంటి ప్రాముఖ్యతలేని అంశంగా మిగిలిపోతుంది. అయితే అసలు విషయమంతా మళ్ళీ నీకు అలా ప్రేమించేవాళ్లు దొరకరని భయపడటంలోనే వుంది. నిజానికి ఎవరో కొందరు విపరీత మనస్తత్వం ఉన్నవాళ్లు తప్ప మిగిలిన వాళ్లందరూ నువ్వు ఎంత ప్రేమని ఇస్తావో అంతకంటే ఎక్కువ ప్రేమని తిరిగి అందించేవాళ్లే అయి వుంటారు.."

ఈ రకంగా ఆనంద్ చెప్పిన విషయాలు తనలో క్రమక్రమంగా మార్పు తీసుకువచ్చాయి.

తర్వాత ఆనంద్ తనకి వివేకానందుడి పుస్తకాలు ఇచ్చి చదవమన్నాడు. అవి చదివాకే నిజంగా ప్రేమంటే ఏమిటో అర్థమైంది తనకి.

స్వచ్ఛమైన ప్రేమనేది ఇవ్వడంలోనే వుంది తప్ప తీసుకోవడంలో కాదని.. ఎప్పుడైతే తిరిగి ఆశించామో అప్పుడు ఆ ప్రేమ స్వచ్ఛతను శంకించాల్సి వస్తుందని తెలుసుకున్నాడు.

"నువ్వు ప్రేమని చాలా సంకుచిత దృష్టితో చూస్తున్నావు" అన్న ఆనంద్ మాటలు కూడా అర్థమైనట్లనిపించాయి.

అంతేకాదు ఆనంద్ తన కజిన్ శృతిని గురించి కూడా అప్పుడే చెప్పాడు. డిగ్రీ పాసైన తను ఎంత నెమ్మది మనస్తత్వం గలదో చెప్పాడు. శృతి వాళ్లది ఆర్థికంగా చితికిపోయిన కుటుంబం.

"శృతికి నీ ప్రేమ వ్యవహారం మొత్తం చెప్పాను. నిజానికి చెప్పాలని కాదు హాస్పిటల్‌కు ఎందుకు వెళ్తున్నానో చెప్పు సందర్భవశాత్తు చెప్పాను. తర్వాతే నాకో ఆలోచన వచ్చింది. నీ స్వభావం నాకు తెలుసు. అతి సున్నితమైన నీ స్వభావానికి మా శృతి తగిన జోడీ అనిపించింది. ప్రతి చిన్న విషయాన్ని పెద్దది చేసి ఆలోచించి మధనపడే నీకు ఎలాంటి పరిస్థితిలోనూ ఆవేశానికి లోనుకాని నెమ్మది మనస్తత్వంగల మా శృతి తగినది అనుకున్నాను. నీకిష్టమైతే మిగిలిన సంగతులు నేను చూసుకుంటాను" అన్నాడు ఆనంద్. శృతి ఫోటో కూడా చూపించాడు తనకు.

అప్పటికి తను ఏ సమాధానం చెప్పకపోయినా తన మంచి కోరే ఆనంద్ మాట తీసెయ్యలేకపోయాడు.

తర్వాత ఓసారి ఆనంద్‌తో పాటు శృతి వాళ్ల నాన్న గారు వచ్చారు తన దగ్గరకు. పెళ్లి గురించి ప్రస్తావనలేమీ జరగలేదు. మామూలుగా మాటామంతీ అడిగి వెళ్లిపోయారు.

రెండ్రోజుల తర్వాత తన ఇంటికి వచ్చిన ఆనంద్ పెళ్లి విషయం మళ్ళీ కదిపాడు.

"శృతి వాళ్ల పేరెంట్స్‌తో కూడా మాట్లాడాను. మొదట నీ ప్రేమ వ్యవహారం విని వాళ్లు సందేహించారు. కానీ నేను నీ గురించి వివరించి చెప్పాను. చీమకూడా హాని చేయలేని నీ మనస్తత్వం గురించీ ఆర్థికంగా గాని, ఇతరత్రాగానీ ఎటువంటి ఇబ్బందులూ లేని నీ జీవితం గురించీ చెప్పాక వాళ్లు ఒప్పుకున్నారు. శృతికి నీ ఫోటో కూడా చూపించాను. ఇదంతా నిన్ను ఒప్పించగలననే ధైర్యంతోనే చేశాను. ఓసారి ఇంటికొచ్చి శృతిని చూడు. శృతికి నా మాట మీద మొదట్నుంచీ పూర్తి నమ్మకం నేనేం చేసినా తన మంచికే చేస్తానని తెలుసు. ఏదేమైనా నీకు నచ్చితేనే పెళ్ళి" ఆనంద్ చెప్పిన దానికి అమ్మానాన్న వత్తాసు పలికారు. వాళ్లతో కలసి శృతి వాళ్లింటికి పెళ్లిచూపులకు వెళ్లాడు తాను. తర్వాత నెలరోజులకే తమ పెళ్లి జరిగిపోయింది.

పెళ్లిచూపుల్లో కూడా తాను శృతినీ అడిగింది ఒకే ప్రశ్న. "నా ప్రేమకథ గురించి తెలుసుకదా.. అభ్యంతరమేమీలేదుగా?" అని. శృతి జవాబు చెప్పింది.. "అంతా అన్నయ్య చెప్పాడు. ఆ విషయం గురించిన ప్రసక్తి ఇంక మన జీవితంలో వద్దు" తనకు కావల్సిందీ అదే.. మరింక ఏ సందేహం లేకుండా పెళ్ళికి ఒప్పుకున్నాడు.

శృతి వచ్చిన తర్వాత తన జీవితంలో ఎటువంటి అపశృతులు తలెత్తలేదు. జీవితం హాయిగా గడిచిపోతోంది.

ఆనంద్ తమ పెళ్లి జరిగిన రెండు నెలలకే హైదరాబాద్‌లో మంచి ఆఫర్ రావడంతో వెళ్ళిపోయాడు. తర్వాత అప్పుడప్పుడు ఫోన్‌లోనే మాట్లాడుకోవడం తప్ప కలవడం జరగలేదు.

ఇప్పుడు మళ్ళీ ఇన్నాళ్లకు ఆనంద్‌ని కలుసుకొనే అవకాశం వచ్చింది.

* * *

విశాఖ ఎక్స్‌ప్రెస్ గమ్యం వైపు పరిగెడుతోంది. శ్రీధర్ తన సీట్లో కూర్చుని మ్యాగజైన్ చూస్తున్నాడు.

రైలుపెట్టె రకరకాల తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ అమ్మేవారితో సందడిగా ఉంది.

ఎదురుగా కూర్చున్నతనికి ఒంట్లో బాగాలేనట్టుంది. అసహనంగా కదులుతున్నాడు. శ్రీధర్ అతన్ని గమనిస్తూనే ఉన్నాడు.

కాసేపటికే అతను వాంతి వస్తున్నట్టుగా చేతిని నోటికి అడ్డంగా పెట్టుకొని వాష్‌బేసిన్ వైపు గబగబా వెళ్లాడు. ఐదు నిముషాల తర్వాత వచ్చి సీట్లో కూర్చున్న అతన్ని చూసి శ్రీధర్ "మీకు ఒంట్లో బాగులేనట్టుంది" అని పలకరించాడు.

అవతలి వ్యక్తి బలహీనంగా నవ్వి "అవునండీ..కాస్త జ్వరంగా ఉంది" అన్నాడు.

"మరి ఇలాంటప్పుడు ప్రయాణం ఎందుకు పెట్టుకున్నారు?" అడిగాడు శ్రీధర్.

"అమ్మకి ఒంట్లో బాగాలేదని ఫోనొచ్చిందండీ. విజయవాడ వెళ్తున్నాను. నా జ్వరానికే ముంది లెండి. అదే తగ్గిపోతుంది" అన్నాడతను.

శ్రీధర్ తన బేగ్‌లో ఉన్న టేబ్లెట్

## ఫార్టీ వచ్చాకే పెళ్లి!

మాజీ విశ్వసుందరి సుస్మితాసేన్ రూటే సెపరేట్ అనవచ్చు. ఓ అనాథ అమ్మాయిని దత్తత తీసుకుని కూతురిలా పెంచుకుంటూ నలుగురి దృష్టినీ ఆకట్టుకుంది. నిర్మాతగా కూడా మారుతోంది. ముప్పయ్ మూడేళ్లొచ్చాయి- ఇక ఆ పెళ్లి కూడా చేసేసుకోవచ్చు కదా అని ఎవరైనా అంటే పెళ్లికేంటి తొందర- ఇంకా ఏడెనిమిదేళ్లయినా ఆగాల్సిందే అంటోంది. అంటే నలభయ్యేళ్లొచ్చాక సుస్మిత పెళ్లిపీటలెక్కుతుందన్నమాట.



తీసిచ్చి "వేసుకోండి టేబ్లెట్ వేసుకోకుండా జ్వరం ఎలా తగ్గుతుంది?" అన్నాడు.

"అబ్బే పర్వాలేదండీ" అన్నాడతను మొహమాటంగా.

"ఫర్వాలేదు వేసుకోండి. ప్రయాణాల్లో ఎప్పుడూ టాబ్లెట్లు బేగ్‌లో ఉంచుకోవడం నాకు అలవాటు" శ్రీధర్ మాత్రతోపాటు వాటర్ బాటిల్ ఇచ్చి అతనితో మాత్రను మింగించాడు.

తర్వాత కాఫీ కేక వినబడితే చొరవగా తానే రెండు కప్పులు తీసుకొని అతనికో కప్పు అందించాడు. కాఫీ తాగాక "కొంతసేపు పై బెర్తు మీద రెస్టు తీసుకోండి జ్వరం తగ్గుతుంది" అన్నాడు శ్రీధర్.

ఆ మాటతో అతను పై బెర్తు మీదకు వెళ్లాడు.

తనలో జరిగే వ్యవహారాలతో సంబంధమేమీ లేనట్టు రైలు పరిగెడుతూనే ఉంది.

ఓ గంట తర్వాత క్రిందకు దిగాడతను. అప్పుడతని మొహం కాస్త తేటగా కన్పించింది శ్రీధర్‌కు.

"జ్వరం తగ్గిందాండీ?" అడిగాడు.

"అవునండీ.. ఇప్పుడు బాగానే ఉంది" చెప్పాడతను. తర్వాత ఇద్దరూ పరిచయాలు చేసుకున్నారు.

ఇతని పేరు కిరణ్. తను కూడా వైజాగ్‌లోనే షిప్‌యార్డ్‌లో జాబ్ చేస్తున్నాడు.

టి.టి.ఇ. రావడంతో ఇద్దరూ తమ టికెట్లు తీసి చూపించారు. పర్సులోంచి టికెట్ తీసి చూపిస్తున్నప్పుడు కిరణ్ పర్సులోంచి జారి పడ్డ ఫోటోని చూసి శ్రీధర్ ఉలిక్కిపడ్డాడు.

అది రాగిణి, కిరణ్‌ల ఫోటో..

"రాగిణి మీకు..." అప్రయత్నంగానే అడిగాడు శ్రీధర్.

కిరణ్ ఫోటోని తీసుకొంటూ "రాగిణి నా భార్య.. తను మీకు తెలుసా?" అడిగాడు.

శ్రీధర్ తడబడుతూ "తె.. తెలుసు రాగిణి యూనివర్సిటీలో నా జూనియర్. చాలా మంచి అమ్మాయి" అన్నాడు.

కిరణ్ నవ్వి "నా భార్య అని తెలియగానే మంచమ్మాయి అంటున్నారా ఏమిటి?" అన్నాడు.

కిరణ్ మాటల్లో అంతరార్థమేమిటో శ్రీధర్‌కి అర్థం కాకపోయినా "రాగిణి నిజంగానే చాలా మంచి అమ్మాయి.. తెలివైనది కూడా" అన్నాడు.

"నేను రాగిణితో విడాకులు తీసుకొని నాలుగు నెలలైంది" కిరణ్ మాటల్లో నిర్వేదం.

శ్రీధర్‌కి షాక్ తగిలినట్టయింది.

"విడాకులు తీసుకున్నారా? ఎందుకు?" కంపిస్తున్న స్వరంతో అడిగాడు.

"పెద్ద కారణాలేమీ కాదండి. రాగిణి మీకు తెలుసంటున్నారు కనుక చెప్తున్నాను. మా విడాకులకు కారణాలు చెప్తే చాలా చిన్న విషయాల్లా కనబడతాయి. అనుభవిస్తేనే కానీ అందులో విషయం అర్థం కాదు"

"ఇంతకీ ఏమైంది?" శ్రీధర్ స్వరంలో ఒక రకమైన ఆత్రుత తొంగిచూసింది.

"ఏం లేదండి. అంతా మాట పట్టింపుల దగ్గరే. అన్నీ చిన్న చిన్న విషయాలు. నాకు సిగరెట్ అలవాటు.. తను వద్దంది.. నెమ్మదిగా మానేస్తానని చెప్పాను. కాదు.. తక్షణం మానేయాలంది. అదో పెద్ద రాద్ధాంతం. అలానే ఒకరోజు పార్టీలో కాస్త డ్రింక్ తీసుకోవాల్సి వచ్చింది. ఆ విషయం నిజాయితీగా నేనే చెప్పాను. దానిని నానా యాగీ చేసింది. ఒకసారి అలవాటు చేసుకుంటే మరింక మానలేరంది. దానికి తోడు విపరీతమైన అనుమానం తనకి. నేను సెక్షనాఫీసరని. ఒకోసారి లేడీ కొలిగ్స్ కూడా అవసరమైతే ఇంటికి ఫోన్ చేసేవారు. ఆ ఫోన్స్ తను లిఫ్ట్ చేస్తే ఇంక ఆ రోజంతా ఆరా తీసి వేధించేది.

ఇలాంటి వే.. ఎన్నని చెప్పగలను? అయితే అసలైన సంఘటన తర్వాత జరిగింది... ఒకసారి మా రికార్డ్ అసిస్టెంట్ అనుపమ తీవ్రమైన జ్వరంతో ఆఫీస్‌లో అపస్మారక స్థితిలో పడిపోతే నేను ఆఫీస్ కార్లో తనని హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళేను. సరిగ్గా అప్పుడే బజార్లో షాపింగ్ చేస్తున్న రాగిణి మమ్మల్ని చూసింది.. అంతే.. ఇంక ఎన్ని చెప్పినా తను నమ్మలేదు. సహనం చచ్చిపోయింది సార్... విడాకులు తీసుకుందామన్నాను. తను కూడా ఒప్పుకుంది.



## దటీజ్ కత్రినా

సల్మాన్ ఖాన్‌తో నిన్నమొన్నటి వరకూ తెగ దోస్తానా చేస్తూ వచ్చిన కత్రినా కైఫ్ ఈమధ్య కాస్త దూరంగానే వుంటోందట. కానీ ఇదే విషయమై ఓ ఆసామీ సల్మాన్‌తో మీ దోస్తీ ఏంటి? అని తరచి తరచి అడిగాట్ట. దీనికి జవాబిస్తూ కత్రినా- 'బాలీవుడ్‌లో చాలామంది తారల్లా నేను ఫలానా వారితో డేటింగ్ చేస్తున్నాను అని చెప్పడం లేదే! సల్మాన్ నాకు మంచి ఫ్రెండ్. అంతే. అంతకు మించి ఈ విషయంలో పెడర్థాలు తీసి నన్ను విసిగించకండి' అంటూ గయ్యిమందిట.

అంతే.. మా దారులు వేరైపోయాయి"

శ్రీధర్‌కి లోకం గిర్రున తిరుగుతున్నట్టనిపించింది.

రాగిణి ఇంత తొందరపాటు మనిషా?

ఆలోచిస్తుంటే ఇప్పుడనిపిస్తోంది. ఒక్కోసారి తనతోనూ చిన్న విషయాల్లోనే వాదన పెట్టుకునేది. లేడీ ప్రొఫెసర్‌తో మాట్లాడానన్నా అనుమానంగా చూసేది. కానీ అప్పుడు అదంతా తనమీదున్న విపరీతమైన ప్రేమవల్లననుకొనేవాడు.

ప్రతి చిన్న విషయంలోనూ పట్టుదల చూపించేది. తను కలవారి బిడ్డ కాబట్టి ఆమాత్రం పట్టుదల ఉంటుందనుకునేవాడు.

ప్రేమలో ఉన్నప్పుడు తనకు రాగిణిలో లోపాలేం కనిపించలేదు. ఆమె ఏం చేసినా అందంగానే ఉండేది. ఆనందంగానే ఉండేది.

కిరణ్ స్థానంలో ఉండాల్సినవాడు తాను. ఉంటే తన పరిస్థితి కూడా ఇలాగే అయ్యేదా?

ఈ రాగిణి కోసమేనా తను మృత్యువు ఒడిలోకి దూకాలనుకున్నాడు?

రాగిణితో పోల్చుకుంటే తన భార్య శృతి ఎంతో ప్రేమమయి అనిపించసాగింది.

అసలు తను ప్రేమలో ఓడిపోయాడా? గెలిచాడా? శ్రీధర్ బుర్ర ఆలోచనలతో బరువెక్కింది.

ఎవరి ఆలోచనలతోనూ సంబంధం లేనట్టుగా రైలు ముందుకు దూసుకుపోతూనే ఉంది.